సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 3 । మే । 2024



వైఎస్సార్‌సీపీలోకి 40 ముస్లిం కుటుంబాలు

బి.కొత్తకోట బీసీ కాలనీలో 40 కుటుంబాల వారు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు.

- 8లో



నలుగురు పిల్లలతో తల్లి అదృశ్యం

కుటుంబ కలహాలతో నలుగురు పిల్లలతో ఓ తల్లి అదృశ్యమైన కేసును పోలీసులు ఛేదించారు. దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

- 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.90	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 330 మెట్రిక్ టన్నులు





జగన్‌పై పగ.. పండుటాకులకు సెగ

- చంద్రబాబు కుట్రలతో పింఛన్‌దారులకు కష్టాలు
- బ్యాంకుల నుంచి డబ్బు తెచ్చుకోవడంలో ఇబ్బందులు పడుతున్న వృద్ధులు
- జిల్లాలో ఎక్కడ చూసినా పెన్షన్ కోసం బ్యాంకుల వద్ద పడిగాపుపు
- ఇప్పటికే ఒకరు చనిపోగా మరొకరికి వడదెబ్బతో అస్వస్థత
- ఈ పాపం చంద్రబాబుదే అంటున్న పింఛన్‌దారులు



పెద్దతిప్పసముద్రంలో పింఛన్‌దారుల పడిగాపులు

రాయచోటి: తెలుగుదేశం పార్టీ దుష్ట కుట్రలో పండుటాకులు విలవిల్లాడిపోతున్నారు. జిల్లాలోని పెన్షన్దారులు రెండవ రోజు కూడా వేడి మంటల మధ్య డబ్బుల కోసం బ్యాంకుల గేట్ల వద్ద కాపలా కాయాల్సి వచ్చింది. అన్నమయ్య జిల్లా పరిధిలో రెండు లక్షల మందికి పైగా పెన్షన్ దారులు చంద్రబాబు దాష్టీకానికి బలయ్యారు.

- నెల 1వ తేదీన మేడే కారణంగా బ్యాంకులు లేకపోవడంతో రెండో రోజున గురువారం పింఛన్ దారులు బ్యాంకుల వద్ద బారులు తీరారు. ప్రతి నెల ఇంటికి వచ్చి చేరుతున్న డబ్బులతో ఆనందంగా గడుపుతున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులు చంద్రబాబు అండ్ కో చేసిన పాపానికి నడవలేని, నిలువ లేని స్థితిలో బ్యాంకుల వద్దకు అడుగులు వేయాల్సి వచ్చింది. వలంటీర్ ఉదయాన్నే ఇంటికి చేరుకుని వేలిముద్రతో డబ్బులు అందించే స్థితి నుంచి ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌తో బ్యాంకులకు వెళ్లి అక్కడ డబ్బుల కోసం ఫామ్ లను పూర్తిచేసుకుని క్యూ లైన్ లోకి వెళ్లడానికి వారు పడ్డపాట్లు వర్ణనాతీతం. గత ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డికి ఓట్లు వేయడంతోనే చంద్రబాబు నాయుడు తమ పట్ల పగబట్టాడంటూ పింఛన్‌దారులు బోరుమని విలపించడం కనిపించింది.
- ప్రతి నెలా 1వ తేదీ రాగానే ఆప్యాయంగా పలకరిస్తూ వచ్చే వలంటీర్లు రెండు నెలలుగా రాలేదు. నెల నెల ఒకటో తేదీన తెలవారకముందే అందుతున్న పైసలు రెండు నెలలుగా చేతికి అందకపోవడంతో సరుకులు, మందులు కొనే పరిస్థితి లేక పింఛన్ దారులు ఇబ్బందులు పడుతూ బ్యాంకులను ఆశ్రయించాల్సి వచ్చింది. బాబు చేసిన పాపానికి మండుటెండలను లెక్కచేయకుండా వృద్ధులు, దివ్యాంగులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాయడం పలువురిని కలచివేసింది. బుధవారం రాయచోటిలోని ఓ బ్యాంకు వద్ద లక్కిరెడ్డిపల్లి మండలం కాకలవరం గ్రామానికి చెందిన ఎం.సుబ్బన్న వేడిని తాళలేక ప్రాణాలను పోగొట్టుకోగా, గురువారం మరికొంతమంది వడదెబ్బ బారిన పడ్డారు.

బాబుకు ఓటుతో బుద్ధి చెబుతాం..

కుక్క కాటుకు చెప్పు దెబ్బ అన్న రీతిలో చంద్రబాబు వంకర బుద్ధికి ఓటుతో బుద్ధి చెబుతామని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు శాపనార్థాలు పెట్టారు. వలంటీర్లు నిస్వార్థంగా ప్రతి ఇంటి గడప ముందుకు వచ్చి పెన్షన్లు అందించేవారన్నారు. పేదలకు మంచి జరుగుతుంటే చంద్రబాబు చూసి తట్టుకోలేకపోతున్నాడని మండిపడుతున్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటుతో తగిన బుద్ధి చెబుతామని అంటున్నారు.

జిల్లాకు 2,24,504 మంది రూ.66.62 కోట్లు.

అన్నమయ్య జిల్లా పరిధిలోని 30 మండలాల పరిధిలో 2,24,504 మందికి 62 కోట్ల 62 లక్షల 62 వేల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీరిలో బ్యాంకు ఖాతాలో 1,64,846 మందికి నేరుగా ప్రభుత్వం వారి ఖాతాల్లో రూ.49,45,38000 పెన్షన్ డబ్బులను జమ చేసింది. బ్యాంకు ఖాతాలు లేని 59658 మందికి 17.17 కోట్ల రూపాయలను విడుదల చేసింది. బ్యాంకుల నుంచి గురువారం 144473 మంది రూ.43,34,19000ను 27.64 శాతం అందుకున్నారు. సచివాలయ ఉద్యోగులు గురువారం రెండో రోజున కూడా ఇంటింటికి వెళ్లి 91.97 శాతం అనగా 54,793 మందికి 15.79 కోట్ల రూపాయలను ఇంట్లోకి వెళ్లి పెన్షన్ డబ్బులను అందజేశారు. బుధవారం మేడే కారణంగా బ్యాంకులు లేకపోవడంతో పెన్షన్ దారులు తమ డబ్బుల కోసం మరో రోజు కోసం వేచి ఉండాల్సి వచ్చింది.

ఇదేం ఖర్మరా బాబూ..!

పెద్దతిప్పసముద్రం: చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల పుణ్యమా అని పింఛన్‌దారులు గత రెండు నెలల నుంచి నరకం అనుభవిస్తున్నారు. వృద్ధులు, వితంతువులు మండల కేంద్రంలోని బ్యాంకుల వద్ద గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సిన స్థితి నెలకొంది.



సంబేపల్లె గ్రామీణ బ్యాంకు వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

పింఛన్ కోసం పడిగాపులు

సంబేపల్లె: ఎన్నికల సందర్భంగా ప్రతి పక్షాలు వలంటరీ వ్యవస్థపై ఈసీకి ఫిర్యాదు చేయడంతో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయడం లేదు. దీంతో ప్రభుత్వం పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలో ఈ నెల పింఛన్ జమచేసింది. ఈ క్రమంలో గురువారం మండల పరిధిలోని ఆయా బ్యాంకులకు పింఛన్‌దారులు వెళ్లి నగదు కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది.

ఈ దుస్థితికి చంద్రబాబే కారణం: కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్: పింఛన్ కోసం వృద్ధులు అనుభవిస్తున్న ఈ కష్టాలకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ వలంటీర్ వ్యవస్థను స్థాపించి పింఛన్‌దారులకు కష్టాలు లేకుండా గడపగడపకు పింఛన్ అందిస్తుంటే చూసి ఓర్వలేని చంద్రబాబు కోర్టులు, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకు వెళ్లి పింఛన్‌దారులకు తిప్పలు పెట్టారన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఒకవైపు వలంటీర్లను ప్రోత్సహిస్తామని చెబుతూనే మరోవైపు వలంటీర్ వ్యవస్థపై ఈసీకి ఫిర్యాదు చేశారన్నారు. రాష్ట్రంలో 66 లక్షల మంది పింఛన్‌దారులలకు కష్టాలు ఎదురయ్యేందుకు టీడీపీనే కారణమని తెలిపారు. చంద్రబాబు ఓడిపోతామనే భయం, అధికారాన్ని తిరిగి పొందాలనే తపనతో పేద ప్రజలను , పింఛన్‌దారులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రజలు ఆలోచించి జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అవసానదశలో అవ్వకు తప్పని అవస్థలు



అమృతమ్మ (80)

కలకడ: కలకడ మండలంలోని కోన గ్రామానికి చెందిన ముద్దుక్రిష్ణ భార్య అమృతమ్మకు వృద్ధాప్య పింఛన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. కదలలేని స్థితిలో ఉన్న ముద్దుక్రిష్ణకు ఇంటివద్దే పింఛన్ ఇచ్చారు. అమృతమ్మకు మాత్రం పింఛన్ ఎక్కడ ఇచ్చేది తెలపలేదు. దీంతో ద్విచక్రవాహనం, ఆటో, కారులో కూడా కూర్చోలేని ఆ వయో వృద్ధురాలు బుధ, గురువారం రెండు రోజులు స్థానిక తపాలశాఖ కార్యాలయం, సచివాలయం, వాలంటీర్ ఇంటికి నానా కష్టాలు పడి నడవలేని స్థితిలో తిరిగినా ఫలితం శూన్యం. దీంతో చేసేది లేక ఎక్కడ పింఛన్ ఇచ్చేది అయినా తెలపండి, ఆ పింఛన్ లేకుంటే నాకు మందులు, తిండి కష్టమవుతుందని అనేక మందిని ప్రాధేయపడింది. ఆమె బాధ చూసి కొందరు ద్విచక్రవాహనంలో పలుచోట్ల తిరిగినా, పింఛన్ పొందే మార్గం తెలియక ఇంటివద్ద వదిలేశారు. కాగా, పంచాయతీ అధికారులను ఈమె పింఛన్ గురించి వివరణ కోరగా బ్యాంక్ ఖాతాలో జమచేపినట్లు తెలిపారు. అయితే అమృతమ్మలాంటివారికి ఇంటివద్దే పింఛన్ ఇవ్వాల్సి ఉండగా, అధికారుల నిర్లక్ష్యంతో ఆమె ఎండలో నానా తంటాలు పడింది.

ఏం స్వామి ఇట్ల చేస్తిరి



నా వృద్ధాప్య పింఛన్ బ్యాంకులో ఇస్తారో..సచివాలయంలో ఇస్తారో తెలీడం లేదు. వలంటీర్లు ఇచ్చేటప్పుడు ఠంచనుగా ఇంటికి వచ్చి చేతికి ఇచ్చేవారు. చంద్రబాబు పుణ్యం కట్టుకున్నాడు. నా పింఛన్ ఎక్కడిస్తారో డబ్బుపడిందో లేదో నాకే తెలీడం లేదు. అయోమయంగా మారింది. ఒక వైపు మండుతున్న ఎండలు.. మరో వైపు పింఛన్ కోసం పడిగాపులు. మాకెందుకీ కష్టం. –పద్మావతమ్మ, టిర్రకోట నగర్, అంగళ్లు, కురబలకోట మండలం

మళ్లీ జగనన్నే రావాలి



నా పేరు కె.మల్లమ్మ, మాది అనంతంపల్లి గ్రామం, పుల్లంపేట మండలం. నేను వితంతు పింఛన్ తీసుకుంటున్నాను. నేను నడవలేను. బ్యాంకుల చుట్టూ తిరిగి పింఛన్ కోసం అవస్థలు పడుతున్నాను. ఇందుకు కారణమైన వారికి మా గోడు తప్పదు. మరలా జగనన్న ప్రభుత్వం వస్తే మా లాంటి వృద్ధుల కష్టాలు తొలగిపోతాయి. –కె.మల్లమ్మ, అనంతంపల్లి, పుల్లంపేట మండలం

పింఛన్ నగదు కోసం అవస్థలు



పింఛన్ నగదు కోసం పలు రకాల అవస్థలు పడుతున్నాం. సచివాలయ సిబ్బంది బ్యాంకు అకౌంట్‌కు నగదు జమ అయిందన్నారు. బ్యాంకుకు వెళ్తే ఆధార్‌కార్డు లింక్ కాలేదు.. ఫోన్ నెంబర్ లింక్ కాలేదు.. అని పలు రకాలుగా చెబుతున్నారు. చంద్రబాబు పుణ్యమా అని ఇబ్బందులు పడుతున్నాం. –మూడే బాబునాయక్, చిన్నమండెం

వైవీయూ డిగ్రీ పరీక్షల ఆకస్మిక తనిఖీ



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న వీసీ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర్‌రెడ్డితో కలిసి వీరబల్లి, సుండుపల్లె డిగ్రీ కళాశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. విద్యార్థుల వసతులను గమనించారు. ప్రతి కేంద్రంలో విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాసుకునేలా చూడాలని కళాశాల యాజమాన్యాలకు ఆదేశాలిచ్చారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అబ్జర్వర్లు హైపవర్ కమిటీ సభ్యులు తనిఖీలు నిర్వహించారు.

పకడ్బందీగా హోమ్ ఓటింగ్ ప్రక్రియ

జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్



రాయచోటి: జిల్లాలో హోమ్ ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆయన పోలింగ్ నిర్వహణపై ఆర్‌ఓలు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మే 3వ తేదీ నుంచి హోమ్ ఓటింగ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ట్రంకు బాక్సులు తదితర మెటీరియల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్ ఇన్‌వ్యాలిడ్ కావడానికి వీలులేదన్నారు. హోమ్ ఓటింగ్‌లో ఓటరు మాత్రమే ఓటు వేయాలని, ఇతరులు ఎవరూ చేయిపట్టుకొని ఓటు వేయించరాదన్నారు. హోమ్ ఓటింగ్ కార్యక్రమానికి సంబంధించి వీడియోగ్రఫీ తప్పకుండా చేయించాలన్నారు. సెక్టార్ అధికారులు జీపీఎస్ ట్రాక్ ఉన్న వాహనాలను మాత్రమే ఉపయోగించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పంపిణీ కార్యక్రమం పెండింగ్ లేకుండా చూడాలని, ఒక్కరికీ కూడా పోస్టల్ బ్యాలెట్ అందలేదనే సమస్య రాకూడదన్నారు. జిల్లాలో మాక్ పోల్ కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా అభ్యర్థుల సమక్షంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు, ఎన్నికల నిర్వహణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం: స్థానిక తరిగొండ రోడ్డులోని ఏపీఆర్ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమామంజుల తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనార్టీ బాలికలు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు సంబంధిత జిరాక్స్ పత్రాలను నేరుగా గానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా గానీ పంపవచ్చన్నారు. పదో తరగతి రెగ్యులర్‌గా చదివిన మైనార్టీ బాలికలు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తు ఫారం కోసం http://aprs.apcfss.inను సంప్రదించాలని సూచించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఒంటిమిట్ట: ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికి లోను కాకుండా తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా ఎస్పీ రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన కొత్తమాధవరం గ్రామాన్ని సందర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామస్తులతో ఎస్పీ మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందని, ఎవరూ ప్రలోభాలు, బెదిరింపులకు భయపడవద్దన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఎస్‌ఎండీ షరీఫ్, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, సిద్ధవటం ఎస్ఐ పెద్దఓబన్న, ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికలకు పోలీసు అధికారులు, సిబ్బంది ఎలాంటి ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశించారు. గురువారం ఒంటిమిట్ట ఎంపీడీఓ కార్యాలయంలో ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ముస్లింల హక్కులు కాపాడేది వైఎస్సార్‌సీపీనే



ఆత్మీయసమ్మేళనంలో ఐక్యత చాటుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు

- ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా, హజ్‌కమిటీ చైర్మన్ గౌస్ ఉల్ ఆజం


మదనపల్లె : రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల హక్కులు కాపాడుతూ, అన్ని విషయాల్లో అండగా ఉంటూ, సంక్షేమానికి కృషిచేస్తూ, ఆకాంక్షలకు, అభిప్రాయాలకు విలువనిచ్చేది వైఎస్సార్‌సీపీనే అని పలువురు ముస్లిం ప్రజాప్రతినిధులు, నాయకులు, మత పెద్దలు తెలిపారు. ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం ఆధ్వర్యంలో గురువారం మదనపల్లెలోని జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో ముస్లిం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సమావేశానికి కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా, హజ్‌కమిటీ చైర్మన్ గౌస్ ఉల్ ఆజం, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్‌అహ్మద్, మదనపల్లె వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మైనారిటీ నాయకులు సయ్యద్ ముఖరం చాంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ...ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ముస్లింలకు కీలకమన్నారు. ఎన్నికల్లో ప్రధాన పోటీ వైఎస్సార్‌సీపీ, ఎన్‌డీఏ మధ్య జరుగుతోందని, బీజేపీని ముందుపెట్టి చంద్రబాబు వెనుక నడుపుతున్న ఎన్నికలన్నారు. మదనపల్లెలో టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా, బీజేపీకి మద్దతు ఇచ్చే పార్టీ తరపున పోటీచేస్తూ, ముస్లింల ప్రయోజనాలు కాపాడుతానని ఎలా చెప్పగలరన్నారు. ఇప్పటికే బీజేపీ నాయకులు ముస్లింలకు అమలుచేస్తున్న 4శాతం రిజర్వేషన్ తొలగిస్తామని, ఎన్‌ఆర్‌సీ, సీఏఏ అమలుచేస్తామని, మదరసాలు బంద్ చేయిస్తామని, టోపీ, హిజాబ్, బురఖా ధరించకుండా కామన్ సివిల్ కోడ్ తెస్తామని బాహాటంగా చెబుతుంటే...ముస్లింలు ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. 2014లో ఉమ్మడి పొత్తులో 600 అబద్ధపు హామీలు గుప్పించిన చంద్రబాబు వాటిలో ఆరింటిని నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వకపోగా, బడ్జెట్ కేటాయింపులు, మంత్రిపదవి కేటాయించలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ చంద్రబాబు, రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో నడుస్తోందని, నాలుగుపార్టీల ఏకైక లక్ష్యం చంద్రబాబుని గెలిపించడమే అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ముస్లింలపై దౌర్జన్యాలు పెరిగాయని టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గుంటూరు నారా హమారా సమావేశంలో ముస్లిం పిల్లలు బాబు వాగ్దానాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తే, అరెస్ట్‌చేసి దేశద్రోహం కేసు పెట్టించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. దేశచరిత్రలో మరే రాష్ట్రంలో ఇవ్వనివిధంగా ముస్లింల సంక్షేమానికి 23,167కోట్ల93లక్షల రూపాయల నిధులను 50లక్షల మంది ముస్లింలకు ఖర్చుచేసిన ఘనత వైఎస్సార్ సీపీది అన్నారు. మైనారిటీల ప్రయోజనాలు కాపాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని, రాజంపేట ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని, మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ముస్లింలందరిపై ఉందన్నారు. ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం మాట్లాడుతూ...మదనపల్లెలో ఇద్దరు ముస్లిం అభ్యర్థులు పోటీలో ఉన్నారని, న్యాయం, నిజాయితీ ఎవరివైపు ఉందో ఆలోచించి ఓటువేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ.. ముస్లింల ఆత్మగౌరవాన్ని కాపాడే వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో అగాఖాన్, మౌలానా మహమ్మద్‌అలీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, నూర్‌ఆజం, లియాఖత్ అలీ, బహుజనసేన శ్రీచందు, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, ఎస్.ఏ.కరీముల్లా, రఫీ, రహీం, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, కరీముల్లా, రియాజ్, బసినికొండ దర్గా పీఠాధిపతి కే.ఎస్.ఎస్.బి.నూర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

బాబు గారి మాటలకు అర్థాలే వేరులే!

- మొన్న రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తామన్న చంద్రబాబు
- నేడు రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగిస్తామని ప్రకటన
- నెల రోజుల క్రితం మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామంటూ హామీ
- పూటకో హామీ.. అవసరానికో అబద్ధం.. ఇదే చంద్రబాబు సిద్ధాంతం

సాక్షి ప్రతినిధి, కడప: 'వినేవాడు లోకువైతే, చెప్పేవాడు చంద్రబాబు'అనే నానుడిని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు టీడీపీ అధినేత. మొన్న రాజంపేట పర్యటనలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తామని ప్రకటించారు. నెల రోజుల క్రితం మదనపల్లె పర్యటనలో ఇక్కడి ప్రజల కోరిక మేరకు అన్ని హంగులున్న మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం రాయచోటి పర్యటనలో అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కొనసాగిస్తామని ఎట్టి పరిస్థితుల్లో మార్చమని స్పష్టం చేశారు. పూటకో హామీ.. అవసరానికో అబద్ధం చెప్పడమే సిద్ధాంతంగా చంద్రబాబు పెట్టుకున్నారు. ఆయన ప్రసంగాలే అందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి.

- అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ఎలాంటి అడ్డదారైనా తొక్కుతారనే అభిప్రాయం ఉంది. ఈ అభిప్రాయాన్ని నిజం చేసి చూపించారు చంద్రబాబు. అధికారంలోకి రాగానే అన్నమయ్య జిల్లాలోనే మూడు నియోజకవర్గాలను జిల్లా కేంద్రంగా కొనసాగించనున్నటుల్ హామీ ఇచ్చారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగిస్తామని తెలిపారు. ఏప్రిల్ 25న రాజంపేటలో పర్యటించిన సమయంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తామని హామీ ఇచ్చారు. మార్చి 27న మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేస్తామని అక్కడ హామీ ఇచ్చారు. చంద్రబాబు వైఖరిలో తాత్కాలికంగా లబ్ధి పొందాలనే ఉద్దేశం మినహా, హామీల్లో చిత్తశుద్ధి లేదని ఇట్టే అర్థం అవుతోందని పరిశీలకులు పేర్కొంటున్నారు.



బీజేపీతో పొత్తు పెట్టుకుంటూనే...

తెలుగుదేశం పార్టీ బీజేపీ, జనసేన పార్టీలతో ఎన్నికల పొత్తు పెట్టుకొని ఎన్నికల బరిలో దిగింది. కలివిడిగా సంసారం చేస్తున్న ఆ పార్టీ అధినేత ఎదుటి పార్టీ కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నట్లుగా చెప్పుకురావడం మరోవింత.' గురివింద గింజ తన కింద ఉన్న నలుపు ఎరుగనట్లు' ప్రత్యక్షంగా బీజేపీతో ఎన్నికల పొత్తు పెట్టుకొని వైఎస్సార్‌సీపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్నారని, బిల్లులు పాస్ అయ్యేందుకు సహకరిస్తున్నారని ఆరోపించడంపై నవ్విపోతున్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటులో విడతల వారీగా మద్దతు ఇస్తామని బాహాటంగా ప్రకటించారు. బహిరంగంగా ఎన్నికల పొత్తు పెట్టుకున్న విషయాన్ని మరుగు పరుస్తూ ముస్లిం మైనార్టీలను మభ్యపెట్టేందుకు కూడా చంద్రబాబు వెనుకాడడం లేదని స్పష్టమవుతోంది.

కడపలో ప్రజాదరణ లేకపోవడంతో...

రాయచోటి సభ ముగించుకొని నిర్ణీత సమయానికే కడప చేరుకున్న చంద్రబాబు వెంటనే రోడ్ షోకు బయలుదేరలేదు. ఆశించిన మేరకు జనసమీకరణ లేదని తెలుసుకొని సుమారు ఒకటిన్నర గంట కడప ఎయిర్‌పోర్టులో ఉండిపోయారు. ఆలస్యం కావడానికి కారణాలు ఆరాతీస్తే అసలు విషయం మరుగుపర్చి జిల్లా నాయకులతో మంతనాలు చేస్తున్నట్లు కలరింగ్ ఇచ్చుకోవడం విశేషం. చంద్రబాబు జిల్లా కేంద్రమైన కడపలో చేపట్టిన రోడ్‌షో సమయానికి ఎండవేడిమి లేకపోయినా ఆశించిన ప్రజాస్పందన కన్పించలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిట్ట మధ్యాహ్నం కార్యక్రమం నిర్వహించినా జనం వేలాదిగా బారులు తీరుతున్నారు. పైగా కాలు కదపకుండా ఉండిపోతున్నారు. చంద్రబాబు అనేక హామీలు గుప్పించినా ప్రజలనుంచి ఆశించిన మద్దతు లభించలేదని టీడీపీ సీనియర్ నాయకుడొకరు వెల్లడించడం గమనార్హం.

అబద్ధాలు చెప్పడంలో ఆరితేరిన వైనం..

తన తప్పులను ఎదుటి వారికి అంటగట్టడంలో చంద్రబాబుకు మించినోళ్లు లేరని రాజకీయ పరిశీలకులు చెబుతుంటారు. అచ్చం అలాగే కడప గడపలో చంద్రబాబు చెప్పుకొచ్చారు. తన హయాంలో కరెంటు చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, యూజర్స్ చార్జీలు పెంచలేదని ప్రకటించుకున్నారు. అలాగే ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏమి చేశారో ప్రజలకు చెప్పలేకున్నారని పేర్కొనడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వాస్తవానికి సిద్ధం సభల నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతి సమావేశంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం వివరిస్తున్నారు. తన హయాంలో మేలు జరిగి ఉంటేనే ఓట్లు వేయమని అభ్యర్థిస్తున్నారు. అలాంటి దమ్ము, ధైర్యం లేకపోగా పచ్చి అబద్ధాలు వల్లించడమే ధ్యేయంగా చంద్రబాబు ప్రసంగం సాగిందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

కార్మిక ఓటర్లకు వేతనంతో కూడిన సెలవు

రాయచోటి: ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలోని ప్రైవేటు సంస్థలలో కార్మికులుగా పనిచేస్తున్న ఓటర్లకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని జిల్లాలోని ప్రైవేటు సంస్థలకు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ (135(బి) ప్రకారం కార్మికులకు ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు గురువారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని రాయచోటి-వేంపల్లి రహదారి మార్గంలోని దర్గా వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాపురం మండలం గోపగుడిపల్లికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు రాయచోటి నుండి ద్విచక్ర వాహనంలో లక్కిరెడ్డిపల్లికి వస్తుండగా మార్గమ మధ్యలోని దర్గా వద్ద రోడ్డు ప్రక్కన నిలిచి ఉన్న ఆటోను ఢీ కొట్టడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుని స్థానికులు 108 ద్వారా లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి మెరుగైన చికిత్సకోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు అక్కడి వైద్యులు తెలిపారు.

మద్యం సీసాల పట్టివేత



ఎక్సైజ్ పోలీసుల అదుపులో అక్రమ మద్యం తీసుకెళ్లుతున్న నిందితుడు

రాయచోటి టౌన్ : అక్రమంగా తరలిస్తున్న 71 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు రాయచోటి ఎక్సైజ్ శాఖ సీఐ హిమబిందు తెలిపారు. వీరబల్లె - గడికోటకు దారిలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో గడికోట గ్రామానికి చెందిన చమర్తి అమరేంద్ర రాజు గోని సంచిలో 71 విస్కీ బాటిళ్లు తీసుకెళ్తుండగా గుర్తించామని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు వివరించారు. ఈ దాడులలో ఎస్ఐ మురళి, సిబ్బంది జయా శంకర్ పాల్గొన్నారు.

వడ దెబ్బతో కూలి మృతి

దువ్వూరు : మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన కూలీ మైలా ఏసన్న (53) గురువారం వడ దెబ్బ తగిలి మృతి చెందాడు. ప్రొద్దుటూరులోని ఓ ఆయిల్ మిల్లులో ఏసన్న రోజు కూలీ పనికి వెళ్లి జీవనం సాగించేవాడు. అదే క్రమంలో గురువారం ప్రొద్దుటూరుకు వెళ్లాడు. మధ్యాహ్నం 2.50 గంటల సమయంలో ఎండ తీవ్రంగా ఎండటంతో వడదెబ్బకు గురై స్పృహ కోల్పోయాడు. వెంటనే తోటి కూలీలు ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్ పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 40 ముస్లిం కుటుంబాలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట బీసీ కాలనీలోని ఇమాం సాబ్, బావాజాన్, జబీర్, వహాబ్‌సాబ్, అయూబ్, ముబారక్, జాఫర్, మునాఫ్ తదితర 40 బుర్లపల్లె కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో తమ కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరడంతో వైఎస్సార్‌సీపీలో చేరాలని నిర్ణయించినట్లు పార్టీలో చేరిన వారు తెలిపారు. ఫోటోవుంది:



బి.కొత్తకోటలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లింలు



వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గాలివీడులో టీడీపీ నుంచి వలసలు

గాలివీడు : మండలంలోని తూముకుంట, నూలివీడు, ప్యారంపల్లె, గుండ్లచెరువు, పందికుంట, గోరాన్‌చెరువు గ్రామాలలోని వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. మండల ఇన్‌ఛార్జి గడికోట సుదీప్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జగనన్న నవరత్నాలు, ఆయన పరిపాలన నచ్చి పార్టీలో చేరామని తెలిపారు. చేరిన వారిలో తూముకుంట సర్పంచ్ రవికుమార్‌నాయుడు, బి.మల్లికార్జుననాయుడు, మధుకృష్ణంనాయుడు, నాగేంద్రనాయుడు, శివప్పనాయుడు, కదిరప్ప, నరసింహులుతోసహా దాదాపు 50 కుటుంబీకులు ఉన్నారు.



తూముకుంటలో వైఎస్సార్‌సీపీలో చేరిన సర్పంచ్ రవి కుమార్‌నాయుడు, తదితరులతో రమేష్‌కుమార్‌రెడ్డి

నూలివీడు, గోరాన్‌చెరువులో

• నూలివీడులో టీడీపీ మండల అధ్యక్షుడు పొట్లి వెంకట రమణారెడ్డి (బుల్లెట్), బండి ఆదినారాయణరెడ్డి, పాపిరెడ్డి, రవి, బేల్దార్ శ్రీను, కృష్ణాంజనేయ, గోపాల్ రెడ్డి, పొట్టి శ్రీనుతోసహా 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

• గోరాన్‌చెరువు గ్రామంలో మధుసూదన్‌రాజు, వై.కుమార్‌రాజు, సుబ్రమణ్యంరాజుతోపాటు 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పందికుంట బోయపల్లెలో భాస్కర్‌రెడ్డితోపాటు 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. రమేష్‌రెడ్డి, గడికోట సుదీప్‌రెడ్డిలు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

టిడిపి నుంచి 30 కుటుంబాలు

వాల్మీకిపురం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి సాధ్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లి పంచాయతీకి చెందిన నూర్ అహ్మద్‌బాషా, బహదూర్, కాలేశా, మస్తాన్, మునీర్, సైసాబ్, ఖాదర్‌బాషా, ఆసిఫ్, సైసాబ్, దర్బార్, సౌఖత్, చాను, ఖాదర్‌వలి, రామయ్య, బాంబేబాష, సయ్యద్‌బాషా, వెంకటరమణ, బాలాజీ, రఫీ, సయ్యద్‌బాషా తదితరులుగురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గండబోయినపల్లిలో మ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పార్టీ కండువాలు వేసి వారిని ఆహ్వానించారు. ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నవరత్నాల ద్వారా ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, నాయకులు రవికుమార్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, వెంకట్రమణ రెడ్డి, పురుషోత్తం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పిల్లలతో తల్లి అదృశ్యం

– ఆచూకీ లభ్యం

చిన్నమండెం : కుటుంబ కలహాలతో నలుగురు పిల్లలతో ఓ తల్లి అదృశ్యమైన కేసును పోలీసులు చేధించారు. ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు. చిన్నమండెం మండలం బోనమల గ్రామం హరిజనవాడకు చెందిన శెట్టిపల్లె నాగరాజు కుమారుడు వరదరాజుకు లక్కిరెడ్డిపల్లె మండలానికి చెందిన అఖిల ఉరాఫ్ వాణితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి భానుప్రియ (7), తరుణ్ (5), విష్ణువర్దన్ (5) సంవత్సరాలు, కృష్ణవర్ధన్ (1) సంతానం.వరదరాజు కువైట్‌లో డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కువైట్ నుంచి మూడు నెలల క్రితం ఇంటి తిరిగి వచ్చాక, ఫోన్‌లో ఎక్కువ సేపు మాట్లాడుతుండటంతో ఏప్రిల్ 30న అఖిలను ప్రశ్నించారు. మనస్థాపం చెందిన ఆమె మే 1వతేదీ ఉదయం తన పిల్లలను వెంటబెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంత సేపటికి రాకపోవడంతో ఆమె భర్త పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలెట్టిన పోలీసులు సెల్ సిగ్నల్ ఆధారంగా ఆమె ఆచూకీని కనుగొన్నారు. మదనపల్లెలోని తన పెద్దమ్మ ఇంట్లో ఉందని తెలుసుకుని ఆమెను తీసుకువచ్చారు. అనంతరం భార్యభర్తలిద్దరికీ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.



దంపతులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్

ఎన్నికల ప్రచారంలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి

నందలూరు(రాజంపేట) : ప్రతి ఇంటికీ సంక్షేమం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, మేడా మధుసూదన్‌రెడ్డిలు అన్నారు. గురువారం నందలూరు గ్రామ పంచాయతీలో ఇంటింటి ప్రచారంలో వారికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రతి ఇంటికీ పథకాలు అందజేసి సీఎం వైఎస్ జగన్ సంక్షేమ ప్రదాతగా నిలిచారని అభివర్ణించారు. మహిళా అభివృద్ధే లక్ష్యంగా పథకాలు అందజేశారన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం విద్యా-వైద్యానికి వైఎస్ జగన్ ఇచ్చినంత ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డిలను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జీవీ సుబ్బారెడ్డి, భూమన శివశంకర్ రెడ్డి, అరిగెల సౌమిత్రి, పల్లె నాగమోహన్, ఎంపీటీసీ ఎస్.సునీత, ఎస్.ప్రభాకర్, అరిగె మణి, అజీజ్, సుభాన్, మస్తాన్, ఉప సర్పంచ్ ఇబ్బు, పి.నాగసుబ్బయ్య, అరిగె నాని, కాకిచంద్ర, బ్యాంకు నారాయణ, మన్సూర్, కరిముల్లా ఖాన్, గొబ్బిళ్ల త్రినాథ్, నడివీధి సుధాకర్, అన్నం నాగేంద్ర మూర్తి, సానా సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం కార్యక్రమంలో ఎంపీ మేడా రఘునాథరెడ్డి, నాయకులు

బుల్లెట్‌తో ఢీకొని.. ఆపై దాడి చేసి...

మదనపల్లె : వ్యక్తిగత పనులపై వెళ్తున్న వ్యక్తి కారును బుల్లెట్ వాహనంతో ఢీకొని.. ప్రశ్నించినందుకు ఆపై అనుచరులతో కలిసి దాడి చేసిన సంఘటన గురువారం పట్టణంలో జరిగింది. వాల్మీకిపురం పట్టణానికి చెందిన ఆసిఫ్ అలీ కుమారుడు మహమ్మద్ యాసిన్ (35), మదనపల్లె పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీలో చికెన్ పకోడీ దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. గురువారం వ్యక్తిగత పనులపై తన సొంత కారులో బికే పల్లెకు వెళ్తుండగా, మార్గమధ్యంలోని రాయల్ ఫర్నిచర్స్ వద్ద ఎదురుగా వచ్చిన బుల్లెట్ వాహనం కారును ఢీకొంది. ప్రమాదంలో కారు సైడ్ మిర్రర్ పగిలిపోవడంతో మహమ్మద్ యాసిన్ బుల్లెట్‌పై వచ్చిన వ్యక్తులను నిలదీసి ప్రశ్నించాడు. దీంతో వారు తమ అనుచరులను ఫోన్ చేసి పిలిపించి, దాదాపు పదిమందికి పైగా గుర్తు తెలియని వ్యక్తులు మహమ్మద్ యాసిన్‌పై విచక్షణరహితంగా దాడికి పాల్పడ్డారు. స్థానికంగా ఉన్న కొందరు మహమ్మద్ యాసిన్‌కు మద్దతుగా రావడంతో వారిపై సైతం దౌర్జన్యం చేసి దాడికి యత్నించారు. అనంతరం గాయపడిన మహమ్మద్ యాసీన్‌ను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా దాడికి పాల్పడిన వ్యక్తులు నీరుగట్టువారిపల్లెకు చెందిన వారిగా భావిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు.

• జై జగన్ మామ అంటూ..



చియ్యవరం గ్రామంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాస్కులు ధరించిన చిన్నారులు మా మామయ్య వైఎస్ జగన్ గెలుపు కోసం మేము సైతం అంటూ నినదిస్తూ ప్రచారంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు వెంట నడిచారు. – రైల్వేకోడూరు

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డి సర్కిల్ : తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో 53 సీట్లకు, తమిళనాడు సేలంలో 12 సీట్లకు, కర్ణాటకలోని గడగ్‌లో 4 సీట్లకు మూడు సంవత్సరాల హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్, టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి జి.నాగరాజారావు ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన ఉండాలన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి దరఖాస్తులను పొందవచ్చని, జూన్ 1వ తేదీ వరకు స్వీకరణకు గడువు ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 93999 36872, 98661 69908, 90102 43054, 08625-295003 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నిప్పుల కుంపటి..



ఉదయం 10 గంటలకే భగభగమంటున్న భానుడు

జిల్లాలో గతేడాది, ఈ ఏడాది నమోదైన ఉష్ణోగ్రత వివరాలు..

తేదీ	గతేడాది		ప్రస్తుత ఏడాది		
తేదీ	కనిష్టం	గరిష్ట	తేదీ	కనిష్టం	గరిష్టం
25.04.23	39.2	28.9	26.05.24	26.8	42.6
26.04.23	26.9	38.0	26.05.24	27.0	43.2
27.04.23	25.8	38.8	27.05.24	26.8	43.4
28.04.23	26.5	39.8	28.05.24	26.8	43.6
29.04.23	26.3	38.5	29.05.24	27.4	44.0
30.04.23	26.4	38.7	30.05.24	27.6	44.5
01.05.24	23.1	37.0	01.05.24	29.2	44.2
02.05.24	26.0	34.2	02.05.24	32.8	44.8

- 44.8 డిగ్రీలకు చేరుకున్న పగటి ఉష్ణోగ్రత
- గతేడాది కంటే పెరిగిన 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- ఆదే స్థాయిలో 32.8 డిగ్రీలకు చేరుకున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- వడదెబ్బతో పిట్టలా రాలుతున్న జనాలు
- ఒకే రోజు వడదెబ్బతో జిల్లాలో ముగ్గురు మృతి
- జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఎండలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సూర్యుడు నిప్పులు కక్కుతున్నారు. దీంతో వృద్ధులు, పిల్లలు విలవిలలాడిపోతున్నారు. గత వారం రోజుల నుంచి జిల్లాలో 44 డిగ్రీలకు మించి ఎండలు కాస్తున్నాయి. 30వ తేదీ జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా 1వ తేదీ 44.2 డిగ్రీలు, 2వ తేదీ 44,8 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదైంది. అలాగే రాత్రి(కనిష్ట) ఉష్ణోగ్రతలు కూడా తారా స్థాయికి చేరుకున్నాయి. గతంలో కనివినీ ఎరుగని రీతిలో రాత్రి(కనిష్ట) ఉష్ణోగ్రత 32.8 డిగ్రీలకు చేరుకుంది. దీంతో రాత్రిళ్లు కూడా వేడి సెగలు కక్కుతున్నాయి. గత వారం రోజుల నుంచి పెరిగిన ఉష్ణోగ్రతలతో 1వ తేదీ జిల్లాలో ముగ్గురు వడదెబ్బతో మృతి చెందారు. ఇందులో 30 ఏళ్ల వయసు ఉన్న కుర్రాడు మృతి చెందాడు. దీనిని బట్టి చూస్తే జిల్లాలో ఎండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమౌతోంది.

రోడ్లన్నీ నిర్మానుష్యం

జిల్లాలో ఎండల తీవ్రత గణనీయంగా పెరగడంతో మధ్యాహ్నానికంతా రోడ్లన్నీ జనాలు లేకనిర్మానుష్యంగా మారుతున్నాయి. పగటపూట పనుల మీద తిరిగే జనాలు, పొలాల్లోకి పనులపైన వేళ్లే రైతులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. కొంతమంది ఎండ వేడికి తట్టుకోలేక గొడుగులను, మరికొంతమంది టోపీలను పెట్టుకుని ఎండతీవ్రత నుంచి తప్పించుకుంటూ తిరుగుతున్నారు. ఈ సీజన్‌లో గతేడాది 34.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఈ ఏడాది ప్రస్తుతం 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంటే గతేడాది కంటే 10 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా ఉంది. దీంతో వృద్దులు, పిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వీటి ప్రభావాన్ని తగ్గించుకునేందుకు ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నేడు జిల్లాలో వడగాల్పులు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వడగాల్పులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. కావున జి ల్లాలో ఎన్నికల ప్రచారాలు చేసే నేతలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎండల తోపాటు వడగాలులతో అప్రమత్తంగా ఉండాల్సి అవసరం ఎంతైనా ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా గొడుగు లేదా టోపీ వాడాలి
- తెలుపురంగు, పలచటి వస్త్రాలతోపాటు లూజుగా ఉన్న దుస్తులనే వేసుకోవాలి
- ఉదయం 11 గంటల నుంచి సాయంత్ర 4 గంటల మధ్య అసవరమైతే తప్ప ఆరుబయట తిరగకూడదు
- వీలైనని సార్లు నీరు తాగడం చేయాలి. అలాగే ఎండలో తిరిగే సమయంలో కొబ్బరినీరు, మజ్జిగ, పండ్ల రసాలు వంటి ఎక్కువగా తీసుకోవాలి. అలాగే నీటిలో నిమ్మరసం, కాస్తంత ఉప్పు కలిపిన ద్రావణాన్ని తీసుకుంటే మంచింది.
- ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగడం, వికారం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యులను సంప్రదించి తగిన సూచనలు, జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆ ముగ్గురు

ఆ ముగ్గురు రాజంపేటకు తొలిఎమ్మెల్యేలు..తొలి ఎమ్మెల్యే ఒకరే కదా ..ముగ్గురు తొలి ఎమ్మెల్యేలు ఎలా అవుతారనే సందేహం వ్యక్తమవుతుంది. ఇది నిజం..ఒకరు రాజంపేట, రైల్వేకోడూరు ఉమ్మడి నియోజకవర్గం నుంచి ఎన్నికైన వారు.. ఉమ్మడి నియోజకవర్గం నుంచి బయటికి వచ్చిన తర్వాత రాజంపేట తొలి ఎమ్మెల్యే మరొకరు...నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రాజంపేట తొలి ఎమ్మెల్యే ఇంకొకరు. వీరు రాజంపేట రాజకీయచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. దీనిపై ప్రత్యేక కథనం.

- తొలి ఎమ్మెల్యేగా కమ్యూనిస్టు నేత పంజం
- రాజంపేటకు కొండూరు మారారెడ్డి
- డిలిమిటేషన్ తర్వాత తొలి ఎమ్మెల్యే ఆకేపాటి
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మళ్లీ బరిలోకి అమరనాథ్‌రెడ్డి


రాజంపేట: ఒక్క నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్యే ఉంటాడని అందరికీ తెలుసు..కానీ 1952లో ఎమ్మెల్యేగా గెలిచిన పంజం నరసింహారెడ్డి రెండు నియోజకవర్గాలకు ఎమ్మెల్యేగా వ్యవహరించారు. ఉమ్మడి నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అనంతరాజంపేట పంచాయతీలోని తంబల్లవారిపల్లెకి చెందిన ఈయన పేరొందిన కమ్యూనిస్టు. కేవలం భూమి ఉన్న వారికే ఓటు హక్కు కలిగిన రోజుల్లో ఆయన ఓ సంచి తగిలించుకొని గ్రామగ్రామాన తిరుగుతూ ప్రజాసమస్యలు తెలుసుకునేవారు. కడప జిల్లాకు వచ్చి కమ్యూనిస్టు ఉద్యమానికి కృషిచేశారు. మొదటి జిల్లా కార్యదర్శిగా పని చేసిన ఘనత ఈయనకే దక్కుతుంది. 1913లో పుట్టి, 1964లో ఆయన మరణించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో దేశం కోసం పాల్గొంటూనే మరో వైపు ప్రజలసమస్యలపై కమ్యూనిస్టుగా పోరాటం చేసిన పంజం రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

రాజంపేటకు తొలి ఎమ్మెల్యే కొండూరు మారారెడ్డి...

ఉమ్మడి నియోజకవర్గం నుంచి రాజంపేట నియోజకవర్గం వేరైంది. 1962లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్రపార్టీ అభ్యర్థిగా పెనగలూరు మండలంలోని కొండూరుకు చెందిన కొండూరు మారారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్పట్లో ఈయన గుర్తు నక్షత్రం. మంచికి మారు పేరుగా..పేదలంటే అభిమానం, ఆప్యాయతలను చూపే ఆయన పట్ల ప్రజలు ఎనలేని అభిమానం చూపేవారు. అందుకే ఆయన ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. తర్వాత భర్త స్థానంలో ఆయన సతీమణి కొండూరు ప్రభావతమ్మ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా రాజంపేట నియోజకవర్గంలో రాణించిన సంగతి విధితమే. ఇప్పుడు కొండూరు సొంతమండలం రైల్వేకోడూరు నియోజకవర్గంలోకి చేరిపోయింది.

డిలిమిటేషన్

తొలి ఎమ్మెల్యే ఆకేపాటి: రాజంపేట, పెనగలూరు, ఒంటిమిట్ట, నందలూరు మండలాలతో ఉన్న రాజంపేట నియోజకవర్గం నియోజకవర్గాల పునర్విభజతో రాజంపేట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలతో రాజంపేట నియోజకవర్గంగా అవతరించింది. తర్వాత జరిగిన డిలిమిటేషన్ (2009)తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో రాజంపేట రాజకీయచరిత్రలో ఆయన స్థిరస్థాయిగా నిలిచిపోయారు. ఆ తర్వాత ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గెలిచిన తొలి ఎమ్మెల్యే ఆకేపాటి చరిత్రకెక్కారు. దివంగత సీఎం వైఎస్సార్ కుటుంబంతో అనుబంధం కలిగిన ఆకేపాటి అంచలంచెలుగా రాజకీయంగా ఎదిగారు.



జగన్‌మోహన్‌రెడ్డికి అండగా..

కాంగ్రెస్ నుంచి జగన్‌మోహన్‌రెడ్డి బయటికి వచ్చినప్పుడు ఆయనకు అండగా నిలబడిన తొలి ఎమ్మెల్యే ఆకేపాటి. వైఎస్సార్ హయాంలో జిల్లా అధ్యక్షుడిగా, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడిగా ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి రాజకీయంగా రాణించారు. 2019లో జగన్ సీఎం కావడమే లక్ష్యంగా తాను పోటీచేయాలనుకున్నప్పటికీ, అధినేత ఆదేశంతో మేడామల్లికార్జునరెడ్డి గెలుపు కోసం కృషిచేశారు.అధికారంలోకి రాగానే ఆకేపాటికి జెడ్పీ చైర్మన్ పదవిని వరించింది. తిరిగి 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశాన్ని అధినేత కల్పించారు.